విజేతలకు బహుమతుల ప్రదానం

ఘట్‌కేసర్: క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మర్పల్లిగూడలో నిర్వహించిన మర్పల్లి గూడ ప్రీమియర్ లీగ్-4 (ఎంపీఎల్-4) శనివారం ఘనంగా ముగిసింది. విజేతగా నిలిచిన శివాజీ జట్టు, రెండో బహుమతి సాధించిన రాయల్ టైగర్స్ జట్టుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కరుణాకర్, మాజీ ఉపసర్పంచ్ నరేశ్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఘట్‌కేసర్: ప్రభుత్వ భూములు రక్షించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్ రజనికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఘనాపూర్, ఎదులాబాద్, చౌదరిగూడ, కాచవానిసింగారం, వెంకటాపూర్‌లో గ్రామకంఠం, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయా భూముల పరిరక్షణకు సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. వినతి అందజేసిన వారిలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, కౌన్సిలర్ నర్సింగ్‌రావు, టీజేఎస్ రాష్ట్ర నాయకుడు లక్ష్మారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, సీపీఐ నాయకులు జయచంద్ర జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదయ్య, మండల కార్యదర్శి సబిత, మాజీ ఎంపీటీసీ కరుణాకర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌ను కాపాడండి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ రాజీవ్‌గాంధీనగర్ కాలనీలోని కమ్యూనిటీ హాలును కబ్జా నుంచి కాపాడాలని కాలనీవాసులు, కార్పొరేటర్ మేక లలితాయాదవ్ సమక్షంలో శనివారం మున్సిపల్ ఆర్వో ప్రభాకర్‌యాదవ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేక లలితాయాదవ్ మాట్లాడుతూ గత 2015లో కమ్యూనిటీ హాల్‌ను ప్రభుత్వం సీజ్ చేసిందని, స్థానిక పేద ప్రజలు చందాలు వేసుకొని కాలనీ కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించుకుంటే కొందరు అక్రమార్కులు అడ్డదారిలో ట్యాక్స్ కట్టి సొంతం చేసుకోవాలని చూస్తున్నారన్నారు. సదరు వ్యక్తులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీనగర్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన ఊరికి సేవ చేయాలనే తలంపుతో...

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేసిన తిరుపతిరెడ్డి



మేడ్చల్ రూరల్: పుట్టిన ఊరికి ఎంతోకొంత సేవ చేయాలని తలంపుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఎన్నారై మజ్జిగ తిరుపతిరెడ్డి తెలిపారు. పూడూర్ గ్రామానికి చెందిన ఎన్నారై మజ్జిగ తిరుపతిరెడ్డి శనివారం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాలలోని 400 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. త్వరలో షూ అందజేస్తానన్నారు. ఎంత ఉన్నత స్థాయిలో ఉన్న అందుకు పుట్టిన ఊరే కారణమనే విషయాన్ని మరువొద్దని ఆయన అన్నారు. ఎంతోకొంత సొంత ఊరికి సేవ చేసి రుణం తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబుయాదవ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు శశికుమార్ యాదవ్, శ్రీకాంత్, న్యాయవాది మహేందర్, గ్రామస్తులు గోపాల్‌యాదవ్, వెంకట్రాంరెడ్డి, చెన్నాయాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మేడ్చల్ రూరల్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 5వ వార్డులో శనివారం నిర్వహించిన జనసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాదిగలకు 7 శాతం రిజర్వేషన్‌తో అన్ని విధాలుగా వెనుకబడి పోయారని 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. రిజర్వేషన్ పట్ల మాదిగలకు అవగాహన కల్పించేందుకు గ్రామగ్రామాల జనసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుండ భానుచందర్, సుధాకర్, డప్పు క్రిష్ణ, సాయిలు, వెంకటేశ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ధరణిలోని పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో ఆయన మాట్లాడారు. ప్రతీ రోజు ధరణిపై మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కరించారని అడిగారు. పెండింగ్‌లోని ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పెండింగ్ మ్యుటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరిజిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'గణాంక దర్శిని' ఆవిష్కరణ



సాక్షి,మేడ్చల్ జిల్లా: జాతీయ 18వ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో శనివారం కలెక్టర్ పి.గౌతమ్' జిల్లా 'గణాంక దర్శిని' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లా గణాంక దర్శిని' పుస్తకంలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం , కుటుంబ సంక్షేమం విద్య, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ప్రజా ఆర్థిక వ్యవస్థ, సామాజిక భద్రత తదితర అంశాలు ఉంటాయన్నారు. విద్యావేత్తలకు, పరిశోధకులకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రతి ఒక్కరికీ గణాంకదర్శిని ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎం. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



హరితహారానికి సర్వం సన్నద్ధం

మొదటి వారం నుంచి మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు

- హరితహారం టార్గెట్ 39.27 లక్షల మొక్కలు
- స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలకు లక్ష్యాలు ఖరారు
- జిల్లాలో ఇప్పటికే 10 వేల గుంతలు తీసిన కూలీలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: హరితహారానికి అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. జులై (వచ్చే నెల) మొదటి వారంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖలవారీగా లక్ష్యాలను ఖరారు చేశారు. అధికారులు స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేసేందుకు అవగాహన కార్యక్రమంతోపాటు తగిన కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఉపాధి హామీ పథకంలో భాగంగా ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో గుంతలు తీస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే పదివేల గుంతలను కూలీలు తవ్వగా, స్వచ్ఛంద సంస్థలు కూడా మొక్కలు నాటేందుకు వీలుగా గుంతలను తీయిస్తున్నాయి.

హరితహారం లక్ష్యం 39.27 లక్షలు...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాదిలో 39.27 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. శివారు 13 పురపాలక సంఘాల్లో హరితహారంలో భాగంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 3 లక్షల మొక్కలు, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 3.73 లక్షలు, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 3.49 లక్షలు, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 3.76లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. అలాగే, మేడ్చల్ మున్సిపాలిటీలో 1.39 లక్షలు, పోచారంలో 71 వేలు, తూముకుంటలో 70 వేలు, దుండిగల్‌లో 2.21 లక్షలు, ఘట్కేసర్‌లో 74 వేలు, నాగారంలో 1.14 లక్షలు, దమ్మాయిగూడలో 1.68 లక్షలు, గుండ్లపోచంపల్లిలో 1.50 లక్షలు, కొంపెల్లి మున్సిపాలిటీలో 1.79 లక్షలు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రూరల్‌లో భాగంగా కీసర మండలంలో 1.55 లక్షలు, శామీర్‌పేటలో 1.30 లక్షలు, ఎంసీపల్లిలో 1.66 లక్షలు, మేడ్చల్‌లో 1.70 లక్షలు, ఘట్కేసర్ మండలంలో 1.84 లక్షలు మొక్కలు నాటనున్నారు. మిగతా మొక్కలన్నీ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్దేశించిన ప్రదేశాల్లో నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు 45 లక్షలు...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో తూముకుంట, కండ్లకోయ, దూలపల్లిల్లోని మూడు నర్సరీల్లో 8 లక్షల మొక్కలు అందుబాటులో ఉండగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 58 గ్రామాల్లోని నర్సరీల్లో 20 లక్షల మొక్కలు, 13 పురపాలక సంఘాలలోని నర్సరీల్లో 17 లక్షల మొక్కలు హరితహారంలో భాగంగా నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది హరితహారంలో గతేడాది నాటిన మొక్కలతో పాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పచ్చదనం.... భూముల పరిరక్షణ...

జిల్లాలో పచ్చదనాన్ని పెంచటంతోపాటు కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, చెరువు శిఖం భూముల పరిరక్షణ లక్ష్యంగా హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక పాంతాలలో కూడా మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. సామూహిక వనాల పెంపకానికి స్థల సేకరణలో సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అర్బన్ పార్కులతో సహా పల్లె, పట్టణ ప్రాంతాల్లో పకృతి వనాల లక్ష్యంగా హరితహారం విజయవంతానికి ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.



పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



పాఠశాల్లో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటుతున్న కౌన్సిలర్ కొత్తసురేఖ భాస్కర్‌గౌడ్

కీసర: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని దమ్మాయిగూడ మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ కొత్తసురేఖ భాస్కర్‌గౌడ్ కోరారు. శనివారం మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు నగరంలోని కొండాపూర్‌లోని ఎంసిఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బాపిరాజు ఆధ్వర్యంలో ఉచితంగా అందజేసిన నోట్‌బుక్స్, ప్లేట్స్, గ్లాస్ , మ్యూజిక్ సిస్టమ్‌ను ఆమె విద్యార్థులకు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సునిత, సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు, నేతలు కొత్త భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి

ఘట్‌కేసర్: మండలంలోని గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎంపీడీఓ గీతారెడ్డితో కలసి మండలంలోని గ్రామాల్లో వీధి లైట్ల ఏర్పాటుపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మండలంలోని రూ. 10.5 లక్షల ఎంపీ నిధులతో లైట్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో హైమాస్ట్ లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే లైట్ల ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ గీతారెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

- కుర్చీలు విసరడంతో వైస్ చైర్‌పర్సన్ వాణికి గాయం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన చైర్మన్



తూంకుంట మున్సిపల్ కార్యాలయం



సీసీ టీవీలో రికార్డయిన వాగ్వాద దృశ్యాలు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వరరావు (బీఆర్ఎస్), కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డిల మధ్య మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. శనివారం తూంకుంట మున్సిపాలిటీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహణ కోసం అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేయగా కౌన్సిలర్లు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో సమావేశం బైకాట్ చేస్తున్నామని, మీటింగ్ పెట్టకూడదని కౌన్సిలర్లు అందరూ బయటకు వెళ్ళాలని వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఎందుకు వాయిదా వేయాలని, ఏదైనా సమస్యలు ఉంటే సమావేశ అనంతరం చర్చిద్దామని రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఇదే క్రమంలో వేణుగోపాల్‌రెడ్డి వెంట వచ్చిన కొందరు వ్యక్తులు కుర్చీలు విసరడంతో వైస్ చైర్‌పర్సన్ పన్నాల వాణికి తగిలి గాయాలయ్యాయి. దీంతో శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశామని చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. 8 మందిపై కేసు నమోదు చేశామని శామీర్‌పేట పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

మేడ్చల్ రూరల్: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటుచేసుకుంది. శనివారం ఉదయం మేడ్చల్ రైల్వేస్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై యువకుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడు మేడ్చల్ పట్టణానికి చెందిన శ్రీనివాస్ (26)గా పోలీసులు గుర్తించారు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

కుటుంబ కలహాలతో...

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్ రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో నివాసం ఉండే వీరేంద్ర చౌహాన్ (48) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా కుటుంబ కలహాలతో మనస్తాపానికి లోనైన చౌహాన్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు స్వయం ఉపాధిలో రాణిస్తేనే ఆర్థిక బలోపేతం

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తదితరులు

కీసర: మహిళలు స్వయం ఉపాధిలో రాణించి ఆర్థికంగా ఎదగాలని మాజీ మంత్రి , మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సూచించారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌జీకేకాలనీలో ఎస్సీ కార్పొరేషన్ మరియుప్రొఫ్యాషన్ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్‌జీకే కాలనీకి చెందిన చెందిన సుమారు 70మంది మహిళలకు దాదాపు 3 నెలలు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్‌ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కుటుంబంలో మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబం ఆర్థికంగా బలపడుతుందన్నారు. ఇందు కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషన్లను అందజేయడంతోపాటు, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. ముమ్ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలను ప్రోఫ్యాషన్ అభయ ఫౌండేషన్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్, కౌన్సిలర్లు, మంగళపురి వెంకటేష్, నానునాయక్, కొత్త సుజాత, నాగయపల్లి సుజాత శ్రీనివాస్, కొత్త హేమలత, స్వప్నహరిగౌడ్, శ్రీహరిగౌడ్, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నేతలు భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అభయ ఫౌండేషన్ సభ్యులు ఉషా, సుచరిత, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు

మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్



రహదారిని శుభ్రపరిచే పనుల్లో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులోని న్యూహనుమాన్‌నగర్ కాలనీలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వివిధ వార్డుల్లో ఎక్కడ కూడా చెత్తచెదారం లేకుండా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు కాలనీ రహదారులను శుభ్రపర్చడంతోపాటు, రహదారుల పక్కన చెత్తాచెదారాన్ని తొలగించి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించడం జరుగుతుందన్నారు. ఎక్కడ కూడా మురుగునీరు, లీకేజీలు లేకుండా చూడటం జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఇండ్ల నుంచి వెలువడే చెత్తను ప్రతిరోజూ మున్సిపల్ ఆధ్వర్యంలో ఇంటి వద్దకు వచ్చే చెత్త ఆటోలకు అందజేయాలన్నారు. అనంతరం సత్యనారాయణ కాలనీ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా కాలనీవాసులతో కలసి కాలనీ రహదారులను శుభ్రపరిచే పనుల్లో మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. అందరి సహకారంతో మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత కౌకుట్ల రాహుల్‌రెడ్డి, కాలనీ అసోషియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు, యూనిఫాంల పేరుతో ప్రైవేటు స్కూళ్ల దోపిడీ



సీఎంఆర్ స్కూల్‌లో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మేడ్చల్: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫారాలు, బ్యాడ్జీలు విక్రయిస్తూ విద్యార్థుల తల్లితండ్రులను దోపిడీ చేస్తున్నారని జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సంతోష్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని సీఎంఆర్ స్కూల్‌లో పుస్తకాలు విక్రయిస్తున్న గది ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లారెడ్డికి చెందిన సీఎంఆర్ స్కూల్‌తో పాటు అన్ని ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు, యూనిఫారంలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల దోపిడీకి పిల్లల విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్కూళ్ల దోపిడీపై పట్టించుకోవాల్సిన అధికారులు చర్యలు తీసుకోకపోవటం శోచనీయమన్నారు. నిబంధనలను పట్టించుకోకుండా పాఠశాల ఆవరణలో పుస్తకాలను విక్రయిస్తూ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఏంఈఓ కార్యాలయ సీఆర్‌పీ బుక్స్ విక్రయిస్తున్న గదిని సీజ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, అరుణ్, బాలకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ



సమావేశంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా డి.సి.ఓ రాజేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రామిడిప్రభాకర్‌రెడ్డి

కీసర: పంటసాగు చేసే రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తింప చేయాలని కీసర మండల రైతులు కోరారు. శనివారం కీసర రైతు సహకార సొసైటీ కార్యాలయం వద్ద సొసైటీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన రైతు భరోసా పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశానుసారం రైతుల నుంచి అభిప్రాయ సేకరణ నిమిత్తం నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ జిల్లా డి.సి.ఓ అధికారి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి వివిధ గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యాయి. వ్యవసాయం చేసే రైతులకు ఎన్ని ఎకరాల్లో వ్యవసాయం చేస్తే అన్ని ఎకరాలకు పెట్టుబడి సాయం కింద రైతుభరోసా పథకాన్ని వర్తింపచేయాలని రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కౌలు రైతులకు కాకుండా పట్టాదారులకు మాత్రమే రైతుభరోసా పథకం అందించాలన్నారు. వ్యవసాయేతర భూములకు, వ్యవసాయానికి పనికిరాని గుట్టలు , రాళ్లకు భూములకు రైతు భరోసా పథకం ఇవ్వవద్దన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు, సి.ఈ.ఓ కృష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విరమణ ఉద్యోగానికే.. సేవలకు కాదు

ఉద్యోగ అనుభవాలను సమాజానికి అందించాలి : ఎంపీ ఈటల రాజేందర్





మేడ్చల్ రూరల్: ఉద్యోగ విరమణ ప్రతీ ఉద్యోగికి సర్వ సహజమని, విరమణ అనేది ఉద్యోగానికేనని వారి సేవలు, అనుభవాలు సమాజానికి ఎళ్లవేళలా అందించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వి.రాములు పదవీ విరమణ మహోత్సవం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించగా ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని కమిషనర్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్‌లో 31 ఏళ్లు, మేడ్చల్‌లో మూడేళ్లపాటు ఉద్యోగ సేవలు అందించడం అభినందనీయమన్నారు. కమిషనర్ రాములు గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో నా చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డు అందుకున్నారని గుర్తుచేశారు. ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదు కాబట్టి వారు మరింత ఆరోగ్యంగా ఉండి అనేక రకాల సేవలు అందించే భాగ్యం భగవంతుడు కల్పించాలని కోరారు. ఉద్యోగానికి విరమణ తప్ప మిగతా అన్ని కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించవచ్చన్నారు. 35 ఏళ్లగా వివిధ హోదాల్లో సేవలు అందించిన ఆయన తన అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని సమాజానికి సంపూర్ణంగా ఉపయోగపడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పాల్గొని కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్ ముదిరాజ్, రజిత వెంకటేశ్, హేమంత్‌రెడ్డి, సరస్వతి, హంసరాణి, పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొని సన్మానించారు.